క్లుప్తంగా

అవగాహనతో నష్ట నివారణ

పాలకొండ రూరల్: అగ్ని ప్రమాదాలపై అవగాహన ఉన్నప్పుడే నష్ట తీవ్రతను తగ్గించవచ్చని అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అగ్ని ప్రమాదాలు – నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం.శ్యామ్‌బాబు, వైస్ ప్రిన్స్‌పాల్ బి.జయమణి, తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం



మగబిడ్డకు జన్మనిచ్చిన ఆది

సీతంపేట: మండలంలోని ఎగువ సీది గ్రామానికి చెందిన ఆరిక ఆది అనే మహిళ 108లో బుధవారం వేకువజామున ప్రసవించింది. ఆమెకు రెండో కాన్పులో పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్‌చేశారు. వెంటనే సిబ్బంది గ్రామానికి చేరుకుని గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో నొప్పులు ఎక్కువవ్వడంతో ఈఎంటీ రమేష్‌బాబు, పైలెట్ కె.శంకరరావు డెలివరీ చేయగా.. పండంటి మగ బిడ్డ జన్మించారు. అనంతరం తల్లీబిడ్డలను ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గోదానం



గోదానంను స్వీకరిస్తున్న ఆలయ అర్చకులు, చైర్మన్

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయాలకు గౌరీపురానికి చెందిన శంబంగి పోలినాయుడు, శంబంగి సత్యం ఆవు, దూడలను దానం చేశారు. ఆలయ అర్చకులు అప్పలాచార్యులకు బుధవారం వాటిని అందజేశారు. అర్చకులు గోపూజ చేసి వాటిని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మర్రాపు సత్యనారాయణ మాట్లాడుతూ.. ఆలయ పునఃనిర్మాణ పనులు జరుగుతున్నందున దాతలు ముందుకువచ్చి తమవంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు భక్తులు, దాతలు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూస్తాం..



క్రాస్‌ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ పద్మావతి

కురుపాం: వేసవి కాలం దృష్ట్యా మండలంలోని 23 పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నామని ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ అప్పారావుతో కలిసి క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని పంచాయతీల్లో ఈ నెల 6 నుంచి ఏప్రిల్ 22 వరకు క్రాస్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా పాడైన తాగునీటి బోర్లు, రక్షిత పథకాలకు మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ నాగేశ్వరరావు, ఏఈ ఆర్.వేణుగోపాల్, ఎంపీటీసీలు గౌడు సంతోషిరాణి, టి.వి.ఎస్.స్వామియాజులు, మండల కోఆప్షన్ సభ్యుడు జిలాని, వైఎస్సార్‌సీపీ నాయకులు శెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి

కురుపాం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పాలకొండ ఆర్డీఓ, కురుపాం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.వి.రమణ బుధవారం సెక్టార్ అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. త్వరలో ఎన్నికల కోడ్ వెలువడనున్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులు ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు. అలాగే సెక్టార్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు చేశారు.

313 మందికి వైద్య పరీక్షలు

పాలకొండ రూరల్: పట్టణంలోని గురువుగారి వీధి సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు తేజారత్నం, పద్మావతి, సిబ్బంది 313 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొంచడ అరుణ్‌కుమార్, కిల్లారి మోహనరావు, బాసూరు కాంతారావు, నగర కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం

భామిని: మండలంలోని బురుజోలలో జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోషిలక్ష్మి మాట్లాడుతూ, అందరినీ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆప్తాలమిస్ట్ కృష్ణారావు, సబ్ యూనిట్ అధికారి పి.అప్పారావు, సీహెచ్‌ఓ భాస్కరరావు, వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

శివరాత్రి పూజలకు ఏర్పాట్లు

- ముస్తాబవుతున్న ఆలయాలు
- గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ...

పాలకొండ రూరల్: మహా శివరాత్రి పర్వదినాన్ని వైభవంగా నిర్వహించేందుకు పాలకొండ పట్టణం, మండల పరిధిలో ప్రసిద్ధిగాంచిన శివాలయాలు ముస్తాబవుతున్నాయి. ముఖ్యంగా మండలంలో కోటిపల్లి, చిన్న మంగళాపురం, తుమరాడ, బెజ్జి, అన్నవరం గ్రామాల్లో కొలువైన శివాలయాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

వాసికెక్కిన విశ్వనాథుడు..

పట్టణంలోని కోమటిపేటలో ఉన్న సింహాద్రి అన్నపూర్ణ సహిత జగద్గురు సనారీ విశ్వనాథ అవధూత ఆలయం ప్రత్యేకం. శ్రీశైల మల్లికార్జున స్వామి ఆలయం తర్వాత అంతటి ప్రాముఖ్యం ఈ ఆలయాని ఉంది. మూడు వందల సంవత్సరాల కిందట క్షీరాచలంగా పిలువబడేది నేటి పాలకొండ. ఇక్కడి కోమటిపేటలో జన్మించిన స్వామి స్వయంగా బంగారంను సిద్ధింపచేయ మహిమలు చూపే వారని ప్రతీతి. సనారి విశ్వనాథ అవధూత స్వామి, ఆయన భార్య అన్నపూర్ణతో కలసి రాజయోగ ధర్మాన్ని పాటిస్తూ అన్ని వర్గాల ప్రజలను శిష్యులుగా చేర్చుకున్నారని భక్తులు చెబుతారు. ఈ స్వామి తన తపోబలంతో సాక్షాత్తూ అపర పరమేశ్వరునిగా కీర్తింపబడుతున్నారు. తన భార్య అన్నపూర్ణ వండిన వంటలను అక్షయ పాత్రలో వేసి నిత్యం వేలాది మందికి అన్నదానం చేసేవారని పూర్వీకులు చెబుతున్నారు.



కోటిపల్లి కొండపై కొలువై న ఉమాకాత్యాయిని సహిత విశ్వేశ్వర ఆలయం



తంపటాపల్లి ఆలయంలో ఒకే పానమట్టంపై ఉమా మహేశ్వర, వీరభద్రస్వామి

కోటిపల్లి కొండపై...

కోటిపల్లి గ్రామంలో ఎత్తైన కొండలపై కొలువుదీరిన ఉమాకాత్యాయిని సహిత విశ్వేశ్వర ఆలయంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు జాతర నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు. ఈనెల 8వ తేదీ రాత్రి 12 గంటలకు లింగాభరణం స్వామికి నిర్వహిస్తారు. అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు మహాన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అద్వితీయ దర్శనం...

తంపటాపల్లిలో కొమ్మూరి కుటుంబీకులు ప్రతిష్ఠించిన శివలింగ దర్శన అద్వితీయం. ఈ ఆలయంలో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒకే పానమట్టంపై ఉమా మహేశ్వర, వీరభద్రస్వాములను సూచిస్తూ రెండు లింగాలు దర్శనమిస్తాయి. ఏక కాలంలో ద్వితీయ లింగ దర్శనం ఈ ఆలయ విశేషం. ఈ ఆలయంలో పర్వదినాల్లో సూర్యకిరణాలు మూలవిరాట్‌ను తాకడం ప్రత్యేకం.

ఎమ్మెల్యే కళావతికి హ్యాట్రిక్ విజయాన్ని అందిద్దాం..

- సీఎం జగన్ మోహన్‌రెడ్డి పిలుపుతో 45 రోజుల దీక్షలు చేపట్టిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు
- కార్యకర్తలకు దీక్షా కంకణాలు కట్టిన ఎమ్మెల్యే కళావతి



వండవలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలో కలసి ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: రానున్న 45 రోజులు మనకు ఎంతో కీలకమని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలంతా సిద్ధంగా ఉండాలని ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపింది. ఈ నేపథ్యంలో మండలంలోని వండవలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు 45 రోజుల దీక్షలు చేపట్టారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతికి హ్యాట్రిక్ విజయాన్ని అందించడమే తమ లక్ష్యమని, ఈ విజయాన్ని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కానుకగా ఇచ్చిన ఆయన్ను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు తామంతా సిద్ధమని కార్యకర్తలు నినదించారు. వీరందరికి ఎమ్మెల్యే కళావతి దీక్షా కంకణాలు కట్టారు. అనంతరం వండవ గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాలు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ, పాలకొండ నియోజకవర్గంలో ఉన్న ప్రతి కార్యకర్త తమ గ్రామంలోని పది ఇళ్లను దత్తత తీసుకోవాలని సూచించారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలను వివరించాలన్నారు.

ఆయా కుటుంబాలకు మేలు జరిగితేనే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని ప్రజలకు చెప్పాలని తెలిపారు. టీడీపీ ఇస్తున్న మోసపూరిత హామీలను కూడా ప్రజలకు వివరించాలని సూచించారు. 2014లో టీడీపీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేక పోయిందని, అలాగే జన్మభూమి కమిటీ సభ్యులు అరాచకాలకు పాల్పడ్డారని, ఇటువంటి విషయాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మిడితాన కల్యాణి, నీలం సత్యంనాయుడు, దమలపాటి ఉమామహేశ్వరరావు, గొర్లె బలరాం, కందల వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు

- ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు

జియ్యమ్మవలస: రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి పిలుపునిచ్చారు. చినమేరంగిలో బుధవారం గరుగుబిల్లి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, మండల, గ్రామ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో ప్రతీ ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకుని సీఎం జగనన్నకు కానుకగా ఇద్దామన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టాలన్నారు. ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి మాట్లాడుతూ.. ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసిన ఘనత జగనన్న ప్రభుత్వానిదే అని, ఇదే విషయాన్ని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియజేయాలని సూచించారు. గత ఎన్నికల్లో సాధించిన మెజార్టీ కన్నా ఈ సారి అత్యధిక మెజార్టీతో పార్టీని గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఎంపీపీ ఉరిటి రామారావు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓ సందర్శన



వసతి గృహంలో గర్భిణుల వివరాలు సేకరిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న గిరిశిఖర గ్రామాల గర్భిణుల వసతి గృహాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాథరావు బుధవారం సందర్శించారు. అక్కడ ఉన్న గర్భిణుల ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. ఎంసీపీ కార్డుల్లో నమోదు చేసిన కాన్పు తేదీలను పరిశీలించారు. గర్భిణులు రక్తహీనత బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ కొయ్యాన అప్పారావు ఉన్నారు.

బాలేసులో ఆరోగ్య సురక్ష శిబిరం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని బాలేసులో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన రోగులకు రేగిడి పీహెచ్‌సీ వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించారు. మందులు అవసరమైన వారికి ఉచితంగా అందజేశారు. వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ జి.జగదీష్‌కుమార్ పర్యవేక్షించారు.

రూ.85 లక్షలతో బీటీరోడ్డు నిర్మాణం

గుమ్మలక్ష్మీపురం: గిరిజన గ్రామాల్లో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని చాపరాయిబిన్నిడి పంచాయతీ కానసింగి గ్రామానికి బీటీరోడ్డు నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. రూ.85 లక్షలతో సుమారు 1.9 కిలోమీటర్ల మేర బీటీరోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. రహదారి సౌకర్యం లేని అన్ని గ్రామాలకు రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మండంగి రాధిక, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, వైస్ ఎంపీపీ నిమ్మక లక్ష్మణరావు, సర్పంచ్ మండంగి దివ్యభారతి, ఎంపీటీసీ ఎం.శ్రీలక్ష్మి, స్థానిక నాయకులు, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి

గరుగుబిల్లి: మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ పి.సూర్యనారాయణ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వీఓఏలతో బుధవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా నిర్దేశించిన రుణ లక్ష్యాలపై సమీక్షించారు. మహిళలకు స్త్రీనిధి రుణాలు, బ్యాంకు లింకేజీ రుణాల మంజూరులో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు చిన్న పరిశ్రమలు స్థాపించేలా వారిని ప్రోత్సహించాలన్నారు.

సంక్షిప్తంగా...

పొదుపుతో ప్రయోజనం

గుమ్మలక్ష్మీపురం: పొదుపు చేయడం అలవర్చుకుంటే ప్రయోజనం కలుగుతుందని మండ ఎంపీపీ స్కూల్ హెచ్ఎం పి.దేవానంద్ అన్నారు. పాఠశాల విద్యార్థులకు పొదుపు ప్రయోజనాలపై బుధవారం అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు ఇచ్చే డబ్బులను చిరుతిళ్లకు ఖర్చు చేయకుండా కొంత మొత్తాన్ని పొదుపు చేయాలని సూచించారు. పుస్తకాలు, పెన్నులు వంటివి కొనుగోలు చేసుకునేందుకు పొదుపు చేసిన డబ్బులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.


ఆదర్శవంతంగా మెలగాలి..

పాలకొండ రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని సమాజంలో ఆదర్శవంతంగా మెలగాలని ఎం.సింగుపురం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.సంఘంనాయుడు అన్నారు. పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉపాధ్యాయులు అరుణ్‌కుమార్, హైమావతి, వరప్రసాద్, ఎల్‌వీ.రమణ, కృష్ణమూర్తి, జ్యోతి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలు సాధించాలి..

సీతంపేట: ఈ నెల 20వ తేదీలోగా ఎన్ఆర్ఈజీఎస్ లక్ష్యాలు సాధించాలని డ్వామా పీడీ రామచంద్రరావు అన్నారు. బుధవారం స్థానిక ఎంఎంఎస్‌లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలుపై సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో ఎటువంటి లోపాలు జరగకూడదన్నారు. ప్రగతిలో చిట్టచివరి స్థానంలో ఉన్న సీతంపేట, భామిని మండలాలకు చెందిన ముగ్గురు ఎఫ్ఏలకు మెమోలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, ఏపీడీ శ్రీహరిరావు, తదితరులు పాల్గొన్నారు.

బత్తిలిలో పోలీస్ కవాతు



బత్తిలిలో పోలీస్ కవాతు

భామిని: త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సాయుధ పోలీసులు బుధవారం కవాతు చేపట్టారు. మండల కేంద్రంలో పాలకొండ డీఎస్పీ కేవీ కృష్ణారావు, సీఐ మురళీధర్, బత్తిలి ఎస్సై సీహెచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు, స్థానిక పోలీస్‌లు సంయుక్తంగా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి అండగా ఉంటామంటూ భరోసా ఇచ్చారు.

ఆధ్యాత్మిక చింతన తప్పనిసరి

పాలకొండ రూరల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని స్థానిక స్వర్ణకారసంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు టేకి ప్రసాదరావు, ఆర్.రవికుమార్ అన్నారు. కోమటిపేట సమీపంలో కొలువైన జగద్గురు సరారీ విశ్వేశ్వర అన్నపూర్ణ ఆలయంలో ఏర్పాటు చేసిన నూతన ధ్యానమందిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మందిర నిర్మాణ దాత హనుమంతు తమ్మారావును సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బాసూరు కాంతారావు, కోడెం విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు నీలాపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన ప్రశ్నపత్రాలు

గరుగుబిల్లి: ఈనెల 18 నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు సంబంధించి సెట్-1, సెట్-2 ప్రశ్నపత్రాలు స్థానిక పోలీస్ స్టేషన్‌కు బుధవారం చేరుకున్నాయి. ఎస్ఐ అమ్మన్నరావు ప్రశ్నపత్రాలను భద్రపరిచారు. ఎంఈఓ నాగభూషణరావు మాట్లాడుతూ మండలంలోని గరుగుబిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాలతో పాటు రావివలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆయా కేంద్రాల్లో 532 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

గిరిజన గ్రామాలకు రహదారులు

- ఎమ్మెల్యే కళావతి



రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలోనే అన్ని గిరిజన గ్రామాలకు రహదారులు వేశామని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని ముత్యాలు జంక్షన్ వద్ద కొత్తగా నిర్మించిన రహదారిని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిశిఖర గ్రామాలకు రహదారులు వేయడం వల్ల అటవీ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడం సులువైందన్నారు. అలాగే 108 వాహనాలు కూడా రాకపోకలు సాగించడం వల్ల ప్రజలు అత్యవసర సమయంలో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని చెప్పారు. ఐదేళ్లలో గ్రామాల్లో మౌలికవసతులు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. తాగునీరు, రహదారులు, విద్యుత్ సౌకర్యాలు కల్పించనట్లు తెలిపారు. టీడీపీ హయంలో ఎటువంటి సదుపాయాలు లేక గిరిజనులు అన్నివిధాలా ఇబ్బందులు పడ్డారన్నారు. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహన్‌రావు, జెడ్పీటీసీ సభ్యురాలు ఎస్.లక్ష్మి, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు ఎస్.లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.రాము, రంగారావు, సింహాచలం పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 287 పోలింగ్ స్టేషన్లు

- ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: పాలకొండ నియోజకవర్గంలో 287 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కల్పనాకుమారి తెలిపారు. బుధవారం స్థానిక ఐటీడీఏ చాంబర్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. లక్షా 94 వేల ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారన్నారు. గ్రామాల్లో ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. విభిన్న ప్రతిభావంతులు ఓటు వేయడానికి వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. 80 సంవత్సరాలు దాటిన వారికి ఇంటినుంచి ఓటువేసే సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. 35 మంది సెక్టోరియల్ ఆఫీసర్లను నియమించామన్నారు. భద్రత కోసం ప్రత్యేకంగా వందమంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది విధులు నిర్వహిస్తారని తెలిపారు. త్వరలో ఎన్నికల కోడ్ వస్తుందని, ఎలక్షన్ కమిషన్ సూచించిన అన్ని నియమ, నిబంధనలు తప్పకుండా పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందిద్దాం..

- ఎంపీడీఓ రామకృష్ణ



వివిధ శాఖల అధికారులతో చర్చిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

పాలకొండ రూరల్: మండల స్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిద్దామని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వ్యవసాయ, ఐసీడీఎస్, వైద్యం, ఆర్‌డబ్ల్యూఎస్, వైకేపీ, ఉపాధిహామీ, సచివాలయ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత వేసవిలో ప్రజల ఆరోగ్య భద్రత, తాగునీటి వనరులు, చిన్నారుల్లో రోగ నిరోధక శక్తిని పెంచేలా తీసుకోవాల్సిన చర్యలపై అధికారుల సూచనలు సేకరించారు. అలాగే రబీలో వ్యవసాయం, ఉద్యానవన పంటలు, ఉపాధి పనుల తాజా స్థితిగతులపై ఆరా తీశారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం



వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేస్తున్న సర్పంచ్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దుడ్డుఖల్లు గ్రామానికి చెందిన కలప మోహిని అనారోగ్యంతో మంగళవారం మృతిచెందింది. వైఎస్సార్ బీమా పథకానికి ఆమె అర్హురాలు కావడంతో దహన ఖర్చుల నిమిత్తం తక్షణ సాయంగా రూ.10 వేలును సర్పంచ్ నిమ్మక నీలావతి, సచివాలయం సిబ్బంది బుధవారం మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. బీమా మొత్తం నామినీ బ్యాంకు ఖాతాలో త్వరలోనే ప్రభుత్వం జమ చేస్తుందన్నారు.

బీసీలు ఇప్పుడు గుర్తుకొచ్చారా బాబూ..

- జెడ్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి

వీరఘట్టం: రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు బీసీలను అణగదొక్కిన చంద్రబాబుకు ఎన్నికల సమయంలో బీసీలు గుర్తురావడం విడ్డూరంగా ఉందని జెడ్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి ఎద్దేవా చేశారు. కత్తులకవిటి గ్రామంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చంద్రబాబు చూస్తున్నారని.. అందుకే అబద్ధపు హామీలతో బీసీలను మోసగించేందుకు ఎత్తుగడ వేస్తున్నారని ఆరోపించారు. 2014 ఎన్నికలకు ముందు బీసీలకు 143 హామీలు ఇచ్చిన చంద్రబాబు వాటిలో ఒక్కటి కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దమలపాటి ఉమామహేశ్వరరావు, నీలం సత్యంనాయుడు మాట్లాడుతూ, చంద్రబాబును బీసీలెవ్వరూ నమ్మరని, ఎన్నికల్లో గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గేదెల సుదర్శనరావు, మనోజ్, ధనుంజయరావు, సూర్యనారాయణ, తమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణే లక్ష్యం



క్రాస్‌ప్రోగ్రాంను ప్రారంభిస్తున్న ఎంపీపీ రామారావు, జెడ్పీ వైస్‌చైర్మన్ బాపూజీనాయుడు

గరుగుబిల్లి: రానున్న వేసవి దృష్ట్యా ప్రతీ గ్రామానికి తాగునీటిని పూర్తిస్థాయిలో సరఫరా చేయడమే లక్ష్యమని ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం క్రాస్ ప్రోగ్రాంను ప్రారంభించారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని, అందులో భాగంగా పాడైన బోర్లు, రక్షిత పథకాలకు మరమ్మతులు చేయడం జరుగుతుందన్నారు. బోరు మెకానిక్ సిబ్బంది గ్రామాలకు వచ్చినపుడు ప్రజలు వారికి సహకరించాలని కోరారు. ఈ నెల 6 నుంచి ఏప్రిల్ 18 వరకు క్రాస్ ప్రోగ్రాంకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు ఎంపీడీఓ పి.సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో జేఈ గౌరీశంకరరావు, తదితరులున్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలి

పాలకొండ: మండలంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని తహసీల్దార్ వరహాలు అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా పోలింగ్ కేంద్రాలపై సమీక్ష నిర్వహించారు. కేంద్రాల వద్ద ఎటువంటి సమస్యలు లేకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయనతో పాటు డీటీ బుచ్చయ్య ఉన్నారు.

బూత్ కమిటీలే కీలకం

భామిని: రానున్న ఎన్నికల్లో బూత్‌కమిటీలే కీలకమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, జేసీఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు టింగ అన్నాజీరావు అన్నా రు. మండలంలోని బత్తి లి, కాట్రగడ్డ, వడ్డంగి సచివాలయాల పరిధి లో 'మేము సిద్ధం -మా బూత్ సిద్ధం' సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు. ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.